సాక్షి అనంతపురం

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం 37.1°/10.3°

జిల్లా అంతటా శుక్రవారం రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

రెండో రోజు ఆరు నామినేషన్లు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్ర ఎమ్మెల్సీకి ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులుగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఒక స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వీరంతా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. పట్టభద్ర ఎమ్మెల్సీకి మల్లేష్ యాదవ్ (అనంతపురం జిల్లా), రామచంద్రుడు (నంద్యాల జిల్లా), నరసింహం (నంద్యాల జిల్లా), పవన్‌కుమార్ (వైఎస్సార్ జిల్లా), అమృతకుమార్ (కర్నూలు జిల్లా) స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. ఇక పీడీఎఫ్ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి నామినేషన్ వేశారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

అనంతపురం సిటీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ అంత్యోదయ' సర్వేలో సమగ్ర సమాచారం సేకరించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, అనంతపురం డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ, డీఎల్‌పీఓ సుమన జయంతి ఇతర అధికారులు హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని అందరూ డీఎల్‌డీఓలు, 63 మండలాల ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈఓపీఆర్‌డీలు, మెడికల్ ఆఫీసర్లు, వెలుగు ఏపీఎంలు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సర్వేలో సూచించిన అన్ని అంశాల గురించిన సమగ్ర సమాచారం సేకరించాలని ఆదేశించారు. సర్వేలో వెనుకబడిన వారు తమ పని తీరు మార్చుకోవాలని.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విధుల నుంచి తొలగింపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైద్య విధాన పరిషత్ పరిధిలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సాధించిన వారిని విధుల నుంచి తొలగించినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. 'వైద్య విధాన పరిషత్‌లో నకిలీలు' శీర్షికన 'సాక్షి'లో గత నెల 28న ప్రచురితమైన కథనంపై స్పందించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంతకల్లులో విధులు నిర్వహిస్తున్న వీరేష్‌కుమార్, ధర్మవరంలో నవీన్, తాడిపత్రిలో కిరణ్‌కుమార్, రాయదుర్గంలో మహేష్, మడకశిరలో దిలీప్‌కుమార్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు వివరించారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్ష

అనంతపురం: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు శుక్రవారం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు ఆర్‌ఐఓ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. జిల్లాలో మొత్తం 256 కళాశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. జనరల్ సబ్జెక్టుకు సంబంధించి 25,775 మంది విద్యార్థులకు గాను 25,386 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2,202 మందికి గాను 2,106 మంది పరీక్ష రాశారన్నారు.

20వ తేదీ 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఈ నెల 20న జరగాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేశామని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆ రోజు అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావొద్దని సూచించారు.

యువతి కిడ్నాప్‌నకు విఫలయత్నం

యాడికి: పిన్నేపల్లిలో యువతి కిడ్నాప్ యత్నం విఫలమైంది. గ్రామస్తులు అడ్డుకోవడంతో కిడ్నాపర్లు పారిపోయారు. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు...గ్రామంలోని ఓ యువతిని బంధువైన యువకుడు పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అయితే యువతికి ఐదారు రోజుల్లో పెళ్లి చేస్తున్నారని సమాచారం తెలుసుకుని ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలనుకున్నాడు. ఇద్దరు స్నేహితులతో కలిసి యువతిని కిడ్నాప్ చేసి.. పెళ్లి చేసుకోవాలని భావించాడు. శుక్రవారం సాయంత్రం తల్లిదండ్రులు తోటకు వెళ్లడంతో యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించిన యువకుడు తన స్నేహితులతో కలిసి ఇంటి వద్దకు వచ్చి యువతిని బలవంతంగా లాక్కుని కారులో ఎక్కించేందుకు ప్రయత్నించారు. ఇరుగుపొరుగు వారు గమనించి వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పిన్నేపల్లికి చేరుకుని కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పారిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.





- గంపలో ఉలిగమ్మ, యల్లమ్మ చిత్ర పటాలు. పటాల నిండా పూలు, నిమ్మకాయలు. అక్కడక్కడా తాయెత్తులు. గంపను తలపై మోసుకెళ్తున్న ఈ మహిళ(జోగినీ) పేరు లక్ష్మీదేవి. ఈమెది కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు గ్రామం. ఐదేళ్ల ప్రాయంలోనే తన మేనమామకు ఇచ్చి పెళ్లి చేశారు. 12వ యేట తాను వయస్సుకు వచ్చినట్లు తెలుసుకుంది. అప్పటి నుంచి ఊరూరా తిరుగుతూ జోగినీ అవతారం ఎత్తింది. ఆమె 22 ఏళ్ల వరకు కూడా జోగినీగా మారినట్లు తనకే తెలియదట. ఆమెకు నలుగురు ఆడపిల్లలు పుట్టగా.. అందరికీ పెళ్లిళ్లు చేసింది.



- తలపై టోపీ పెట్టుకుని ఉన్న వ్యక్తి పేరు రాము. కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన ఇతను ఆరో తరగతి వరకు చదువుకున్నాడు. ఐదేళ్ల ప్రాయం నుంచే జుట్టు పొడవుగా పెరుగుతూ వచ్చింది. 7, 12, 15వ ఏట వెంట్రుకలు తీయించినా అలాగే పెరుగుతూ వచ్చాయి. రాములోకి అమ్మవారు వస్తోందని కుటుంబ సభ్యులు విశ్వసించారు. కర్ణాటక రాష్ట్రంలోని ఉచ్చంగి దుర్గ ఆలయంలోని యల్లమ్మ వద్ద రాము మెడలో తాళి, పూజల దండ వేసి జోగినీగా మార్చారు. అనంతరం తల్లి చిత్తమ్మ, అక్క రామలక్ష్మి సైతం జోగినులుగా మారారు.

దురాచారానికి చెక్

- గౌరవప్రదమైన జీవితమే లక్ష్యం
- దేవదాసీ వ్యవస్థ రూపుమాపేందుకు జగన్ సర్కార్ చర్యలు
- సర్వే చేపట్టి.. అర్హులందరికీ సంక్షేమ పథకాల వర్తింపు
- ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తోడ్పాటు
- ప్రభుత్వ చర్యలతో దేవదాసీలకు ఊరట

కళ్యాణదుర్గం: సమాజంలో వారంటే అందరికీ చిన్నచూపే. జోగిని, బసివిని, మాతంగి, దేవదాసి పేరు ఏదైనా వారి బతుకులు దుర్భరం. పేదరికం, నిరక్షరాస్యత, అమాయకత్వం వారిని దాసీలుగా మార్చాయి. పూర్వం దేవుని దాసి పేరుతో ముక్కుపచ్చలారని అమ్మాయిలకు తాళి కట్టించి దేవుని భార్యగా చేసి ఊరికి వదిలేవారు. ఊరు ఊరంతా వీరిని ఓ ఆట వస్తువులా చూసేవాళ్లు. ముఖ్యంగా ఈ వ్యవస్థ ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల్లోని ఆడపిల్లలను బలి చేసింది. పసిమొగ్గలను పాశవికంగా చిదిమి, లైంగికంగా వేధించి, తండ్రెవరో తెలియని బిడ్డలకు తల్లిని చేసింది ఈ వ్యవస్థ. నాటి నుంచి ఆరాధ్య దైవాలైన యల్లమ్మ, ఉలిగమ్మ దేవతలను పూజిస్తూ ఊరూరా తిరుగుతూ భిక్షమెత్తుకుంటూ బతుకీడిస్తున్నారు. ఈ సాంఘిక దురాచారం నుంచి విముక్తి కల్పించేందుకు జగన్ సర్కార్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సమాజంలో ఉన్నతంగా జీవించడానికి అవసరమైన చర్యలు చేపడుతోంది. సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారికాళ్లపై వారు నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గౌరవ ప్రదమైన జీవనం సాగించేందుకు సర్కార్ తోడ్పాటునందిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా సర్వే

జోగినీ, మాతంగి, బసివిని, దేవదాసీ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేపట్టింది. సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ సచివాలయాలు, మహిళా పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల వారీగా ఆర్డీఓ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో కలిసి సర్వే చేస్తున్నారు. సాంఘిక దురాచారాన్ని పారదోలేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిశితంగా పరిశీలిస్తున్నారు. వారికి అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పనపై ఆరా తీస్తున్నారు. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ వ్యవస్థను రూపుమాపే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

జిల్లాలో వెయ్యిమందికి పైనే..

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం వెయ్యి మందికి పైగా జోగినీ, మాతంగి, దేవదాసీలు ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిరతో పాటు ఉరవకొండ, హిందూపురం, రాప్తాడు, అనంతపురం, శింగనమల నియోజకవర్గాల్లో ఈ వ్యవస్థ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా నియోజకవర్గాల్లో ఈ వ్యవస్థను రూపుమాపేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జోగినీల పిల్లలకు చదువులు చెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జోగినీలను గుర్తించి, వారికి పింఛన్ సౌకర్యం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జోగినులు తమ కాళ్లపై తాము నిలబడేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు హామీ కూడా ఇచ్చారు.

ప్రత్యేక కమిషన్

జోగిని, దేవదాసి, బసివినులను గత ప్రభుత్వాలు విస్మరించాయి. వారి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ దురాచారాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. హోం మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఐదుగురు ప్రిన్సిపల్ సెక్రటరీ తదితరులు కమిషన్ సభ్యులుగా ఉన్నారు.



జోగినులు, మాతంగి, దేవదాసీలు

పథకాలు అందుతున్నాయి



నాకు వితంతు పింఛను రూ.2500 వస్తోంది. ఇటీవల వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 మంజూరైంది. నా మనువళ్లు, మనువరాళ్లకు అమ్మ ఒడి ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. జోగినీ వ్యవస్థ పోవాలంటే మాలాంటి వాళ్లకు ప్రభుత్వం పక్కా ఇల్లు, మూడెకరాల పొలం, వయసుతో సంబంధం లేకుండా పింఛను ఇవ్వాలి.

– హెచ్ మాణిక్యమ్మ, జోగినీ, కనుకూరు

మూఢాచారాలకు స్వస్తి పలకాలి



జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో 1002 మంది జోగినులను గుర్తించాం. వీరిలో 80 శాతం మందికి ప్రభుత్వం నుంచి వివిధ పథకాలు అందుతున్నాయి. మిగిలిన 20 శాతం మందిలో ఆధార్ వివరాల్లో తప్పులు, చిన్నచిన్న సాంకేతిక తప్పిదాలతో పథకాలు అందనట్లు గమనించాం. ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నాం. ఇటీవలే జిల్లా స్థాయిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. అక్కడే ఆధార్ మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించాం. ఇలాంటి మూఢాచారాలకు గ్రామీణులు స్వస్తి పలకాలి.

– ఫక్కీరప్ప కాగినెల్లి, ఎస్పీ, అనంతపురం

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఇన్‌చార్జ్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఏఎస్పీ నాగేంద్రుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 23 వరకు ఉంటుందన్నారు. 24న స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. 27వ తేదీలోగా నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్లను గుర్తించి అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌కు పంపించామన్నారు. ఒక్కొక్క కేంద్రంలో 800 నుంచి 1,400 ఓట్లు ఉండేలా చూశామన్నారు. పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లేదా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే వీడియో చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌కు పంపిసామన్నారు. ఏఎస్పీ నాగేంద్రుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లాకు వర్ష సూచన లేదు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన లేదని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం 35.5–36.1 రాత్రి 17.0–18.0 డిగ్రీలు నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 63–68, మధ్యాహ్నం 19–25గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

కల్తీ మాఫియా

- జోరుగా కల్తీ ఆహార పదార్థాల తయారీ
- ఏది అసలో.. ఏది నకిలీనో గుర్తించలేని దుస్థితి
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

- వారం క్రితం అనంతపురంలోని సప్తగిరి సర్కిల్‌లో ఓ మందుల షాపు యజమాని బ్రాండెడ్ తేనె బాటిళ్ల ఆర్డరు ఇచ్చారు. 500 మిల్లీలీటర్ల తేనె డబ్బా రూ.530తో కొన్నారు. నాలుగు రోజులు దాటిందో లేదో బాటిళ్లు మొత్తం గడ్డకట్టాయి. తీరా చూస్తే అదంతా బెల్లం అని తేలింది. అవాక్కయిన యజమాని అన్నీ వెనక్కు పంపించారు. ఓ ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ నుంచి వచ్చిన ఈ తేనెనే ఇలా ఉంటే ఇక గల్లీల్లో తయారయ్యే నూనెలు, ఐస్‌క్రీములు, వంటకాలు వంటివి ఎలా ఉంటాయో అంచనా వేయచ్చు.



కల్తీ తేనె డబ్బాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కొందరు వ్యాపారులు సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఆహార పదార్థాలు కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వంట నూనె, పాలు, వెన్న, నెయ్యి, కారంపొండి తదితర అన్ని రకాల ఆహార పదార్థాలూ కల్తీ మాఫియాగుప్పిట్లోకి వెళ్లిపోయాయి. ఏది మంచిదో, ఏది కల్తీదో వినియోగదారులు తేల్చుకోలేకపోతున్నారు. అయినా ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం ఆహార పదార్థాల నాణ్యతను గాలికొదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విషపూరితమవుతున్న పాలు

కల్తీపాలు ఇప్పటికీ యథేచ్ఛగా వస్తున్నాయి. కొన్ని రకాల నూనెలను బాగా మరగకాచి, వాటిలో కొన్ని క్రీములు కలిపి పాలుగా చూపుతూ డెయిరీ సంస్థలకు అమ్ముతున్నారు. డెయిరీ సంస్థలు కేవలం ఫ్యాట్ కంటెంట్ (కొవ్వు శాతం) మాత్రమే చూస్తాయి గానీ, ఇవి నకిలీవా, కాదా అనేది చూడవు. నకిలీ పాలల్లోనూ 11 శాతం పైనే కొవ్వు ఉన్నట్టు చూపిస్తాయి. వేల లీటర్ల మంచిపాలల్లో వందల లీటర్ల కల్తీ పాలు పెద్దగా కనిపించవు.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, ఆర్వో ప్లాంట్లు, ఆహార పదార్థాల నిల్వలపైనా తనిఖీలు నిర్వహిస్తున్నాం. కల్తీకి పాల్పడ్డవారు ఎంత పెద్ద వారైనా వదిలేది లేదు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

–చక్రవర్తి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

అన్నీ కల్తీ మాఫియా గుప్పిట్లోనే

- చెడిపోయిన వెన్నను కాచి నెయ్యి తయారు చేస్తున్నారు. సువాసన కోసం రసాయనాలు కలుపుతున్నారు.
- రకరకాల రసాయనాలతో పాటు కొన్ని రకాల పొట్టును కలిపి కారంపొడి తయారు చేస్తున్నారు.
- గ్లూకోన్‌డీని కూడా కల్తీమయం చేశారు. రసాయనాల మిశ్రమం, శాక్రిన్‌లు కలిపి ఇస్తున్నారు. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం గుల్లవుతోంది.
- హోటళ్లలో చికెన్, మటన్ వంటకాల్లో హానికారక రంగులు కలుపుతున్నారు.
- పప్పు దినుసుల్లోనూ కల్తీ జరుగుతోంది. శనగపిండిలో బియ్యపు పిండి కలిపి అమ్ముతున్నారు.
- చిరు ధాన్యాలు ఆకర్షించేలా ఉండటం కోసం ఓ రకమైన నూనెలను కలుపుతున్నారు.

ఎస్‌ఐ ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్ష రేపు

- 20 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 13,423 మంది అభ్యర్థులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం, పరిసర ప్రాంతాల్లో ఈ నెల 19న ఎస్‌ఐ ఉద్యోగాలకు ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. పోలీసులు, జేఎన్‌టీయూ అధికారులతో కలసి ఆయన శుక్రవారం జేఎన్‌టీయూ పరీక్షా కేంద్రం, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఎస్‌ఐ ఉద్యోగాలకు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 20 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 13,423 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఐదు రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక్కో రూటుకు డీఎస్పీ ఇన్‌చార్జిగా ఉంటారని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద సీఐ లేదా ఎస్‌ఐ బందోబస్తు పర్యవేక్షిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటుగా అదనంగా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని తెలిపారు. మొబైల్స్, ఇతర డిజిటల్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. దళారులు ఎవరైనా ఉద్యోగాలిప్పిస్తామని చెబితే తక్షణం తమకు సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీతో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, వన్ టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర..



విద్యుత్ దీప కాంతుల నడుమ అనంతపురం మొదటిరోడ్డు శివాలయం

మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని ప్రముఖ శైవాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపకాంతులతో ఆలయాలు వెలుగొందుతున్నాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు భక్తులు జాగారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఎన్నికల ఏర్పాట్లు షురూ..



పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ ఎన్నికల్లో ఓట్లు బ్యాలెట్ బాక్సుల్లో వేయనున్నారు. పోలింగ్‌కు వినియోగించే చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం 600 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు 386 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 175 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

– అనంతపురం అర్బన్

పశువులకు హోమియో వైద్యంతో సత్ఫలితాలు

• పశువైద్యుల శిక్షణలో నిపుణులు వీవీఆర్‌కే శాస్త్రి


శిక్షణ ఇస్తున్న డాక్టర్ వీవీఆర్‌కే శాస్త్రి

అనంతపురం అగ్రికల్చర్: 'హోమియో పతి' పశువైద్యంపై పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉన్న పశువైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక డీడీ కార్యాలయ హాలులో జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం అధ్యతన జరిగిన శిక్షణకు బెంగళూరుకు చెందిన హోమియో వైద్య నిపుణులు డాక్టర్ వీవీఆర్‌కే శాస్త్రి హాజరై అవగాహన కల్పించారు. పశువుల్లో వచ్చే సాధారణ, సీజనల్, అంటువ్యాధులకు ఇంగ్లిష్ మందులకన్నా హోమియో మందులు సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో రైతులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా సహజ సిద్ధ పద్ధతులు ద్వారా పశుసంతతి పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పశుశాఖ డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశులు, ఏడీలు ఏవీ రత్నకుమార్, నాగార్జునరెడ్డి, శ్రీనివాసగుప్తా, కేఎల్ శ్రీలక్ష్మి, పద్మనాభం, వీహెచ్, వీడీలకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు.

ఆర్జేడీపై దాడి అమానుషం

అనంతపురం: విద్యాశాఖ ఆర్జేడీ బి. ప్రతాప్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.అశోక్ కుమార్‌రెడ్డి, కాడిశెట్టి శ్రీనివాసులు, కే. గోవిందరెడ్డి, పీవీ రమణా రెడ్డి, రాధా కృష్ణా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోవాలి తప్ప దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

• అప్రజాస్వామిక చర్యలకు దిగడం తగదని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏఎం గిరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ఆర్జేడీగా సమీక్ష చేసే అధికారం ఉన్నప్పటికీ , అది వద్దని చెప్పడం ప్రభుత్వ వ్యతిరేక చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

నేను డబ్బు తీసుకోలేదు

• 'సాక్షి' వార్తకు స్పందించిన ఔషధ నియంత్రణ ఏడీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తాను ఏ మెడికల్ షాపు వద్ద డబ్బు వసూలు చేయలేదని ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం 'సాక్షి'లో 'మందులోళ్లతో మనీ బంధం' శీర్షికతో వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. కొత్త షాపులకు లైసెన్సులకు కూడా ఒక్కపైసా తీసుకోలేదని అన్నారు. ఎవరైనా ఎక్స్‌పెయిరీ డ్రగ్స్ అమ్మితే వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేయచ్చన్నారు. ఇదిలా ఉండగా గురువారం కూడా సాక్షి ప్రతినిధి పలు మెడికల్ షాపుల యజమానులతో ఔషధ నియంత్రణ అధికారుల మామూళ్లపై ఆరా తీయగా... నిజమేనని, అయితే ఒక్కో ఏరియాలో ఒక్కో రేటు ఉంటుందని చెప్పారు. సప్తగిరి సర్కిల్‌లోని ఓ మెడికల్ షాపు యజమాని తాను ఆరు మాసాలకు ఒకసారి రూ.6 వేలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గార్లదిన్నెలో ఓ మెడికల్ షాపు యజమాని తాను తన లైసెన్సుకు రూ.20 వేల వరకూ ఖర్చు చేశానని పేర్కొన్నారు.

కొత్త ప్రాజెక్టులకు సీడీపీఓల నియామకం


ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

అనంతపురం సిటీ: ఐసీడీఎస్‌లో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 17 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన తరువాత అనంతపురం జిల్లాలో 10, శ్రీసత్యసాయి జిల్లాలో ఏడు ప్రాజెక్టులు చొప్పున వెళ్లాయి. మూడు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు కావడం, జనాభా పెరగడం, కొత్త ఊర్లు పుట్టుకొస్తుండడంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులను కూడా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. రెండు జిల్లాలకూ కలిపి కొత్తగా ఏడు ప్రాజెక్టులు వచ్చాయి. అనంతపురంలో ఒకటి, శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు ప్రాజెక్టులను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 24కు పెరగనుంది. ఇందుకు సంబంధించి ప్రాజెక్ట్ అధికారిణుల (సీడీపీఓలు) నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీడీపీఓల నియామకం

ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయి అధికారులు శుక్రవారం సాయంత్రం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులకు సీడీపీఓల నియామకానికి సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏయే ప్రాజెక్టుకు ఎవరెవర్ని నియమించారనే సమాచారం ఆయా సీడీపీఓలకు వివరించినట్లు తెలిసింది.

అనంతలో ఇలా..

అనంతపురం అర్బన్, కంబదూరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, కణేకల్లు, ఉరవకొండ, కూడేరు, గుత్తి, శింగనమల, తాడిపత్రి ఉన్నాయి. తాజాగా కూడేరు ప్రాజెక్టు రద్దు చేసి అనంతపురం రూరల్ ప్రాజెక్ట్‌ను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. నార్పలలో కూడా కొత్త ప్రాజెక్టు ప్రారంభిస్తారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

హిందూపురం, మడకశిర, ధర్మవరం, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, కదిరి తూర్పు, కదిరి పడమర ప్రాజెక్టులు పాతవి ఉన్నాయి.

జిల్లా పేరు	పాత ప్రాజెక్టులు	కొత్త ప్రాజెక్టులు
అనంతపురం	10	1
శ్రీసత్యసాయి	7	6
మొత్తం	17	7

తాజాగా బత్తలపల్లి, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు, సోమందేపల్లి, గుడిబండ, పుట్టపర్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. కదిరిలో రెండు ప్రాజెక్టులకు గాను ఒక ప్రాజెక్టునే కొనసాగిస్తారు. మిగిలిన ప్రాజెక్టులు యథావిధిగా కొనసాగుతాయి.

రెండ్రోజుల్లో నియామక ఉత్తర్వులు

శుక్రవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించిన ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయి అధికారులు.. ఏయే ప్రాజెక్టుకు ఎవరెవర్ని నియమించారనే వివరాలు ఆయా అధికారులకు మాత్రం వెబ్ కౌన్సెలింగ్‌లో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారికంగా సోమవారం లేదా మంగళవారం జారీ చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు 'సాక్షి'కి తెలిపారు.

డీపీఆర్ఓగా ఓంప్రకాశ్‌రెడ్డి ఎంపిక



అనంతపురం అర్బన్: అనంతపురం జిల్లా అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఓంప్రకాశ్‌రెడ్డి జిల్లా పబ్లిక్ రిలేషన్ అధికారిగా (డీపీఆర్ఓ)గా ఎంపికయ్యారు. రాష్ట్రంలో నాలుగు డీపీఆర్ఓ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గత ఏడాది నవంబర్‌లో పరీక్ష నిర్వహించింది. వాటి ఫలితాలు ఈనెల 15న విడుదలయ్యాయి. మెరిట్ సాధించిన నలుగురు అభ్యర్థులను డీపీఆర్ఓ పోస్టుకు ఏపీపీఎస్సీ ఎంపిక చేసింది. అందులో ఓంప్రకాశ్‌రెడ్డి ఒకరు కావడం గమనార్హం. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఈనెల 16న జారీ అయ్యాయి. డీపీఆర్ఓగా సెలక్ట్ అయిన అభ్యర్థులకు ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో పోస్టింగ్ ఇస్తుందని సమాచారం.

మేఘనాథరెడ్డికి విమలాశాంతి పురస్కారం

అనంతపురం కల్చరల్: విమలాశాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా సాహితీ వేత్తలకందించే కథా సాహిత్య ప్రత్యేక పురస్కారాన్ని చిత్తూరు జిల్లాకు చెందిన యువ కథా రచయిత 'కలుంకూరి గుట్ట కథలు' సంకలన కర్త కే.వీ మేఘనాథరెడ్డికి అందించనున్నారు. ఈ మేరకు సీనియర్ రచయిత శాంతి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో పురస్కార ప్రదానోత్సవం మానవతా తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. సీమ వ్యాప్తంగా పలువురు ప్రసిద్ధులైన రచయితలు, కవులు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఒకేరోజు ఏడిళ్లలో చోరీ

కంబదూరు: మండలంలోని ఓబగానిపల్లిలో ఒకే రోజు ఏడిళ్లలో చోరీలు జరిగాయి. పోలీసుల వివరాలమేరకు... ఓబగానిపల్లికి చెందిన హరిజన సోమక్క, తండా షేక్, గొల్ల ఆనందమ్మ, మాల జ్యోతి, సోమశేఖర్ నాయక్, వెంకటేశులు, హనుమంతప్ప గురువారం రాత్రి ఇళ్లలో లేకపోవడంతో ఇళ్ల తాళాలను పగలుగొట్టి వస్తువులు ఎత్తుకెళ్లారు. 1.50 తూలాల బంగారం, రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని పల్లేపల్లిలో బోయ శివ (28) అనే యువకుడు గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బోయ శివకు 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే సంతానం కలుగలేదు. భార్య శివమ్మకు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న బోయ శివ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. సోదరుడు బోయ రాజు ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశులు తెలిపారు.

రాయలసీమ, తెలంగాణ రెండు కళ్లు


ఆకలికేకలు పాటను ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న

అనంతపురం: రాయలసీమలోని చాలా బాణీలు తన పాటలకు స్ఫూర్తిగా నిలిచాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భువనవిజయంలో ఎస్కేయూ తెలుగు విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ సిగిలిరేవు రామాంజినేయులు రచించి గానం చేసిన ' ఆకలికేకలు' పాట ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా గోరేటి వెంకన్న హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... రాయలసీమ ప్రజల్లో కష్టపడే మనస్తత్వం, అమాయకత్వం చాలా బాగా నచ్చాయన్నారు. ఇక్కడి ప్రజలు రాజకీయవాదులు కాదు.. చాలా నిజాయతీ పరులన్నారు. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలు తనకు రెండు కళ్లన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి, న్యాయవాది రాంకుమార్, కృష్ణ వేణి వాసంతి , రేలారే గాయకుడు నాగరాజు, దాదాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు


మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: జిల్లా ప్రజలకు రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని పరమశివుడు వేడుకుంటున్నట్లు తెలిపారు.

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: మహాశివరాత్రి పర్వదినాన్ని జిల్లా వాసులు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆకాంక్షించారు. జాగరణ, శివ పార్వతుల కల్యాణం, తదితర వేడుకల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శైవ దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైస్ ద్వారా అనుమానితులను చెక్ చేయలన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రానికి పట్టిన అష్ట దరిద్రం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు... కరువు కాటకాలకు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్ల రాష్ట్ర ప్రజలు కరువుతో విలవిలలాడిపోయారన్నారు. ఏకంగా రెండు సంవత్సరాలు రాష్ట్రం మొత్తం కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. అలాంటి అష్టదరిద్రుడు చంద్రబాబు .. ముఖ్యమంత్రి జగన్‌ను ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ కారుకూతలు కూస్తున్నారన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రకు ప్రజల్లో స్పందన లేకపోవడంతో ఫ్రస్ట్రేషన్‌లో చంద్రబాబు, లోకేష్ మీడియా దృష్టిలో పడాలని నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రమంతా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇలాంటి పరిస్థితుల్లో పోలీసులను అనుమతి కోరకుండా మీటింగ్‌లను అడ్డుకుంటున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. చరిత్రలో గుర్తుండిపోయే ఒక్క పథకాన్నైనా చంద్రబాబు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశ పెట్టారా? అని ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవినీతి, అక్రమాలు లేకుండా సంక్షేమ ఫలాలను వారి ఇంటి ముంగిటకే అందజేస్తున్న ఏకైక సీఎం జగనని కొనియాడారు.

రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఓబుళపతి

అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ఓబుళపతి, హెచ్.గిరిధర్ రెడ్డి, వి.రాజమోహన్‌రెడ్డి, టీవీ రమణారెడ్డి అన్నారు. అనంతపురంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌టీఎఫ్‌తో పాటు 36 సంఘాల మద్దతుతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బహుమతి ఇవ్వనున్నామన్నారు.

నరమృగవాహనంపై రామలింగేశ్వరుడు



తాడిపత్రి టౌన్: బుగ్గరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం రాత్రి పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి నరమృగవాహనంపై భక్తులకు పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఆలయం నుంచి గాంధీకట్ట, గానుకవీధి, పోలీస్ స్టేషన్ రోడ్డు, సీబీరోడ్డు, అశోక్‌పిల్లర్, మెయిన్ బజార్ మీదుగా గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో 'నిమ్మ మొక్కలు'

బుక్కరాయసముద్రం: రంగాపూర్ నిమ్మ, వేరు కాండంపై అంటు కట్టిన చీనీ మొక్కలు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో రైతులకు అందుబాటులో ఉన్నాయని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9618449951, 9133315989 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విధులు అప్రమత్తంగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విధులు అప్రమత్తంగా నిర్వహించాలని ఎస్పీ ఫకీరప్ప కాగినెల్లి పోలీసు అధికారులను ఆదేశించారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయన పోలీసు బందోబస్తును పరిశీలించారు. చేపట్టిన ఏర్పాట్లను డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను వందశాతం అమలు చేయాలన్నారు. చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకూడదని ఆదేశించారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వీరబ్బాయి అన్నారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంలో భాగంగా జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అబార్షన్లు జరుగుతున్న ప్రైవేటు ఆస్పత్రులను గుర్తించి సమగ్ర విశ్లేషణ రిపోర్టు అందించాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యుగంధర్, ప్రోగ్రాం అధికారులు సుజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ముస్లింలు



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందిస్తున్న ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్‌ను ముస్లింలు శుక్రవారం వారి నివాసంలో కలిశారు. నగరంలోని జామియా మసీదు అంశంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం హర్షించదగిన విషయమని ముస్లింలు కొనియాడారు. విచారణ నిష్పక్షపాతంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, చాంద్‌బాషా, రియాజుద్దీన్, తబ్రేజ్, షకీల్, మున్నా, హబీబ్, హాజీవలి, రహీం, ఖాదర్, జావీద్, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ చేయించుకోండి

- డీఎల్‌డీఓ ఓబులమ్మ

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ ఆధార్ నవీకరణ చేయించుకోవాలని అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ శుక్రవారం తెలిపారు. 2010 నుంచి 2016 ఏప్రిల్ నెలాఖరులోపు ఆధార్ కార్డుదారులు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ప్రతి మండలంలో రెండేసి చొప్పున గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పేరు, పుట్టిన తేదీ, నివాస స్థలానికి సంబంధించిన అన్నీ ఆధారాలు కలిగిన ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. లేకపోతే ఆధార్ కార్డు పనికి రాకుండాపోతుందని హెచ్చరించారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ



ఫ్రైడే డ్రైడేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని నాయక్‌నగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని కృపానంద నగర్‌లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరి యా అధికారి ఓబులు, సబ్ యూనిట్ అధికారి మ ద్దయ్య, సయ్యద్‌నూర్ బాషా, శేఖర్ పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీ విద్యార్థినికి నగదు పురస్కారం



పాముల శైలజ

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఎంఏ తెలుగు విద్యార్థిని పాముల శైలజ నగదు పురస్కారానికి ఎంపికై ంది. తాడేపల్లి గూడెంలోని బీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రకాశిక సాహిత్య పత్రిక సంయుక్తంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇవ్వనున్న నగదు పురస్కారానికి శైలజ ఎంపికైనట్లు నిర్వాహకులు డాక్టర్ సుంకర గోపాలయ్య తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి విద్యార్థినిని అభినందించారు.

మొక్కుబడిగా మండల మీట్

కనగానపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి తీర్మానాలు లేకుండా అధికారులు మండల సర్వసభ్య సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో సమావేశంలో తీర్మానాలు, కొత్త ప్రతిపాదినలు లేకుండా.. కేవలం అధికారుల ప్రగతి నివేదికల సమర్పనతో సమావేశం ముగించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పద్మావతి పాల్గొన్నారు.

స్టాలిన్ నగర్‌లో బైక్ అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని స్టాలిన్ నగర్‌లో మారుతీ అనే వ్యక్తికి చెందిన పల్సర్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కళ్యాణదుర్గం రోడ్డులో హోటల్ నిర్వహిస్తున్న మారుతీ.. హోటల్ బంద్ చేసి, రాత్రి ఇంటికి వచ్చి పార్కింగ్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూడగా పల్సర్ బైక్ కనిపించలేదు. బాధితుడు నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శైవ క్షేత్రాలకు మహాశివరాత్రి శోభ

- శని త్రయోదశికి పెరుగుతున్న భక్తుల రద్దీ
- సుందరంగా ముస్తాబైన శివాలయాలు







వాహనసేవలో కాశీవిశ్వేశ్వరుడు,రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ,ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు

అనంతపురం కల్చరల్: సకల పాపాలను హరించే 'నమః శివాయ' అన్న పంచాక్షరి మంత్రంతో నగరం మార్మోగుతోంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఆలయం శోభాయమానంగా ముస్తాబవుతోంది. నగరంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి.

శివపార్వతుల కల్యాణోత్సవం :
నగరంలో పలు చోట్ల శివపార్వతుల కల్యాణ మహోత్సవం నయనానందకరంగా సాగనుంది. మాఘ మాస బహుళ చతుర్థి నాడు వచ్చే శివరాత్రి రోజున కల్యాణోత్సవాలు కమనీయంగా సాగనున్నాయి. శివరాత్రి నాడు కై లాసవాసుడైన మహేశ్వరుడు లింగాకారం నుంచి మామూలు రూపం సంతరించుకుని భక్తులకు దర్శనమిస్తాడని కార్తీక పురాణం చెపుతోంది.

వాడవాడలా మహా శివరాత్రి వేడుకలు :
జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. నగరంలోని మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు పెద్ద ఎత్తున సాగే వేడుకల్లో ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు ఈవో సుధారాణి తెలిపారు. శారదా శృంగేరి మఠం, శివకోటి, మూడోలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక లింగోద్భవ వేడుకలు నిర్వహిస్తున్నారు. విరూపాక్షేశ్వరాలయం, అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయం, మారుతీనగర్‌లోని కోదండరామాలయం, చెరువుకట్ట వద్దనున్న ప్రాచీన శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సిద్ధమయ్యాయి.

నేడు మహా శివరాత్రి వేడుకలు
ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శని, ఆదివారం మహా శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం గణపతి పూజ, స్వస్తి వాచనం, గోపూజ, ద్వారాపాలక పూజ, ఆలయ ప్రవేశం మంజునాథ స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సాయంత్రం మంజునాథ కల్యాణోత్సవం ఉంటుంది. ఆదివారం రుద్రాభిషేకం, 39 మంది బ్రాహ్మణులతో శతరుద్రాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాప్తాడు: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉన్న శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. మండల కేంద్రంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ఆలయం, రామేశ్వరస్వామి ఆలయం, చిన్మయనగర్, అయ్యవారిపల్లి, గంగలకుంట, బొమ్మేపర్తి, పుల్లలరేవు, యర్రగుంట, ఎం.బండమీదపల్లి, గాండ్లపర్తి, బుక్కచెర్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు జరుగుతాయి. హంపాపురం సమీపంలోని మౌనగిరిక్షేత్రంలో వెలసిన 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయం, మరూరు చిన్నకదరయ్యస్వామి ఆలయం, అయ్యవారిపల్లిలో ఎర్రితాత ఆలయంలోనూ పూజలు జరగనున్నాయి. శనివారం అన్ని ఆలయాల్లో స్వామికి అభిషేకం, అన్నాభిషేకం, అంకురార్పణ, కలశ ప్రతిష్ఠ, గణపతి హోమం, లక్షబిల్వార్చన సాయంత్రం వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి అన్నదానం, తర్వాత మృత్యుంజయ యజ్ఞం, రుద్రహోమం, తదితర పూజలు జరుగుతాయని పూజారులు తెలిపారు.

కైలాస వాహనంపై మహాశివుడి దర్శనం
అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శుక్రవారం మొదటిరోడ్డు శివాలయంలో భక్తులు పోటెత్తారు. రాత్రి ప్రదోష కాల పూజల తర్వాత వాహన సేవలు నేత్రమనోహరంగా సాగాయి. నగరోత్సవం స్థానిక మొదటిరోడ్డు నుంచి రెండో రోడ్డు, మూడోరోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుంది. ఉదయం మహాశివుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, దీక్షాహోమం జరిగాయి. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఈవో సుధారాణి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత

- బ్రహ్మకుమారి శివ జయంత్యుత్సవాల్లో ఎంపీ తలారి రంగయ్య



శివలింగం వద్ద పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలను ప్రభుత్వం ప్రత్యేక గౌరవం ఇచ్చి, అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శుక్రవారం రాత్రి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శ్రీ త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాతూరులోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళా సాధికారత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిస్టర్ శారద నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. మహిళలను అత్యంత గౌరవించే మన దేశంలో ఇంకా చాలా చోట్ల వివక్ష ఉండడం బాధాకరమన్నారు. బాలబాలికలను సమానంగా గుర్తించి పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ప్రతి రంగంలో మహిళలకు పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతిని నెలకొల్పడానికి బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీమన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున లక్ష దీపార్చన, జ్యోతి లింగ ప్రదర్శనలు భక్తి భావాన్ని నింపాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీదేవి, దేవరకొండ కౌసల్య, వత్సలానందన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలు వసూలు చేయించాలి



70వ సచివాలయంలో సిబ్బందితో రీసర్వేపై ఆరా తీస్తున్న కమిషనర్ కే భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: చెత్త నిర్వహణకు యూజర్ చార్జీలు వసూలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులు, మెప్మా సిబ్బందిని కమిషనర్ కే భాగ్యలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. యూజర్ చార్జీల జాప్యంపై సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. చార్జీలు వసూలు చేయడంతో ఎంతో వెనుకబడ్డారని, ఇదే పనితీరును కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రజలు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లకు కమిషనర్ సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి :
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం నగరంలోని 68, 69, 70 సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం వేళల్లో క్షేత్రస్థాయి పర్యటన, మధ్యాహ్నం నుంచి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. రీ సర్వేకు సంబంధించి వివిధ అసెస్‌మెంట్లకు సర్వే నంబర్లు అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ వెంట సీసీ ఉదయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

45వ సచివాలయం అడ్మిన్‌కు మెమో :
నగరంలోని 45వ సచివాలయం అడ్మిన్ కార్యదర్శి దీక్షిత్‌కు అదనపు కమిషనర్ రమణారెడ్డి మెమో జారీ చేశారు. విధులకు అనధికారికంగా డుమ్మా కొట్టినందుకు మెమో ఇచ్చినట్లు అదనపు కమిషనర్ తెలిపారు. సెలవులో వెళ్లాలనుకునే సచివాలయ సిబ్బంది ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులకు హాజరైతే శాఖపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

ఆర్జేడీపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి



అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి

అనంతపురం: విద్యాశాఖ ఆర్జేడీపై భౌతిక దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. నారాయణ రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు ఎస్పీ నాగేంద్రుడుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బి. ప్రతాప్ రెడ్డి సతీమణి టి. కల్పలత రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతూ, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారన్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉందనే ఆక్రోశంతో ఆర్జేడీని టార్గెట్ చేయడం భావ్యం కాదన్నారు. కేవలం విధి నిర్వహణలో భాగంగానే ఆయన అనంతపురంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారన్నారు. దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించిన అంశాలన్నీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డిపై దాడి తగదు
అనంతపురం: ఆర్జేడీ బి.ప్రతాప్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు సి.గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే వెంకట రత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్జేడీని ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

ఎస్కేయూ క్రికెట్ జట్టు ఎంపిక



ఎస్కే యూనివర్సిటీ క్రికెట్ జట్టు సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3 వరకు బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా యూనివర్సిటీల సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో వారు ఎస్కేయూ క్రికెట్ జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టును ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని వీసీ ఆకాంక్షించారు. జట్టుకు మేనేజర్‌గా చంద్రమోహన్, కోచ్‌గా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ క్రికెట్ జట్టు : అర్జున్ టెండూల్కర్, రోహిత్‌రోషన్, వినయ్, చంద్రశేఖర్, కౌశిక్, మొహమ్మద్ సోను, నరసింహులు, దత్తారెడ్డి, జయకృష్ణ, ప్రమోద్‌కుమార్, భార్గవ్, వెంకటేశులు నాయక్, సాదిక్, కుళ్లాయప్ప, రాజశేఖర్.

రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్టూడెంట్ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటి, పతకాలు సాధించారు. స్థానిక కమ్మభవన్ సమీపంలోని సీఅండ్ఎం డే స్కాలర్ క్యాంపస్ పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగంలో విన్నర్‌గా, అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో శశివర్ధన్ ప్రథమ స్థానంలో, సాయి హర్షిత్ ద్వితీయ స్థానంలో, సాయి చరణ్ తృతీయ స్థానంలో నిలిచారు. చెస్ అండర్-14 విభాగంలో సంజయ్ రామస్వామి ద్వితీయస్థానం, కిరీటి తృతీయ స్థానం, అండర్-17 విభాగంలో చరణ్ తృతీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు. వీరిని పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, డీన్ శ్రీనివాసరెడ్డి, సిరాజుద్దీన్, పీఈటీలు రవిరాజ్, సింధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులను డీఈఓ సాయిరాం అభినందించారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా క్రీడాకారులు మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-14 బాలికల జట్టు ప్రథమ స్థానాన్ని, బాలుర విభాగం జట్టు ద్వితీయ స్థానం, అండర్-17 విభాగంలో బాలుర జట్టు ద్వితీయ స్థానంలో రాణించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, మేనేజర్ రామాంజనమ్మ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు మొరార్జీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో రాతిదూలం పోటీలు

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరులో శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఈ నెల 19న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , తోపుదుర్తి బ్రదర్స్ ఆర్థికసాజన్యంతో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. సనప గ్రామంలో మాధవరాజుల పరుష సందర్భంగా 25న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 19న బి.యాలేరులో శివరాత్రి పండుగ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీల్లో మెదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. 25 న సనప గ్రామంలో మాధవరాజుల పరుష సందర్భంగా జనరల్ విభాగం రాతి దూలం లాగుడు పోటీలకు సంబంధించి మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు అందిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో జరుగుతున్న విన్సెంట్ ఫెర్రర్ వెటరన్ క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం నిర్వహించిన మ్యాచుల్లో అనంతపురం ఆర్డీటీ జట్టు కడప జట్టుపై, నెల్లూరు జట్టు హైదరాబాద్ వెటరన్ క్రికెట్ అసోసియేషన్ జట్టుపై విజయం సాధించింది. అనంత క్రీడా గ్రామంలోని బీ గ్రౌండ్ క్రీడా మైదానంలో వెటరన్ క్రికెట్ మ్యాచులు నిర్వహించారు. క్రికెట్ పోటీలను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పర్యవేక్షించారు. తొలి మ్యాచ్‌లో అనంతపురం ఆర్డీటీ వెటరన్ జట్టు, కడప వెటరన్ జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం ఆర్డీటీ వెటరన్ జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్రధాన క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు వెటరన్ క్రికెట్ జట్టు, వెటరన్ క్రికెట్ అసోసియేషన్ హైదరాబాద్ జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 156 పరుగులు మాత్రమే చేసింది. దీంతో నెల్లూరు జట్టు 15 పరుగులతో విజయం సాధించింది.

ఎస్‌బీఐ పథకాలపై అవగాహన

ఆత్మకూరు: ఖాతాదారులు, ప్రజలు బ్యాంకుల్లో పథకాలపై తెలుసుకోవడం అవసరమని అనంతపురం రీజినల్ మేనేజర్ జాఫర్ మొయినుద్దీన్ తెలిపారు. శుక్రవారం సనప గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి ఏజీఎం ఎఫ్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని, అర్హత కలిగిన మహిళా సంఘాలు రూ.20 లక్షల వరకు రుణం పొందొచ్చన్నారు. ఎస్‌బీఐ కొత్తగా రైతుల కోసం పశుపోషణకు రుణాలు సామాజిక భద్రత పథకాలైన సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన, యోనో వంటి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు కేదార్‌నాథ్, రామమూర్తి, ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.